



# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 15-07-2025 | సంపుటి - 24 | సంచిక -72 | రూ : 4 | పేజీలు: 8







# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 15-07-2025 | సంపుటి - 24 | సంచిక - 72 | రూ : 4 | పేజీలు: 8




## భూమి పైకి శుభాంశు శుక్లా సహ వ్యోమగాములు తిరుగు ప్రయాణం

- గత నెల 25న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన వ్యోమగాములు
- డ్రాగన్ వ్యోమనౌకలో తమ తమ స్థానాల్లో కూర్చున్న నలుగురు వ్యోమగాములు
- తిరిగి వచ్చాక వారం రోజుల పాటు క్వారంటైన్‌కు వ్యోమగాములు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. యాక్సియం4 మిషన్‌లో భాగంగా వారు గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన విషయం విదితమే. అంతరిక్ష

తరువాయి 2లో

## యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గా మరాఠా సైనిక కోటలు!

**పారిస్ లో 47వ యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ సమావేశం**

- భారత్ కు చారిత్రాత్మక విజయం
- 12 మరాఠా సైనిక కోటలకు విశిష్ట గుర్తింపు
- భారత్ లో యునెస్కో హెరిటేజ్ సైట్ల సంఖ్య 44కి పెరిగిన వైనం

పారిస్‌లో జరిగిన 47వ యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో భారతదేశం మరో చారిత్రక విజయాన్ని సాధించింది. 'మరాఠా సైనిక కోటలు' యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరాయి. దీంతో భారతదేశంలో ఉన్న యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ల సంఖ్య 44కు చేరింది. ఈ గుర్తింపు మరాఠా సామ్రాజ్యం యొక్క సైనిక చాతుర్యం మరియు కోటల నిర్మాణ కళను ప్రపంచానికి చాటిచెప్పింది. 17వ శతాబ్దం

తరువాయి 2లో





## గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు..

- నేడు రెండు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం
- ఓ కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఇవాళ రెండు రాష్ట్రాలకు గవర్నర్ లను, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు, హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా

తరువాయి 2లో

## అందుకు చైనాకు కృతజ్ఞతలు

**భారత్-చైనా సంబంధాలపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు**

- మోదీ, జిన్ పింగ్ భేటీ తర్వాత సంబంధాలు పుంజుకున్నాయి.
- విభేదాలు వివాదాలుగా మారకూడదన్న జైశంకర్
- భారత్, చైనా సంబంధాలు ప్రపంచానికి మేలు చేస్తాయి



భారత్‌చైనా సంబంధాలపై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 అక్టోబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు పుంజుకుంటున్నాయని అన్నారు. విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ.. సంఘర్షణగా మారకూడదని ఆయన అన్నారు. చైనా పర్యటనలో ఉన్న జైశంకర్ ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టియాంజిన్ వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకోవాలని, మంచి ఫలితాలు రావాలని కోరుకున్నట్లు చెప్పారు. ఇరుదేశాల విదేశాంగ శాఖ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ, దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక

తరువాయి 2లో

## గోదావరి నీళ్లు ఇవ్వలేదు కానీ ముఖ్యమంత్రి వస్తే అడ్డుకుంటామని చెబుతున్నారు

- తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి
- రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం, గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధమన్న రేవంత్ రెడ్డి
- పదేళ్లు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ కు సన్నబియ్యం ఆలోచన రాలేదని విమర్శలు

ప్రతిపక్ష నేతలు అధికారంలో ఉన్నప్పుడు గోదావరి నీళ్లు ఇవ్వలేదని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి వస్తే అడ్డుకుంటామని చెబుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ

తరువాయి 2లో




## ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



- టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు
- పోర్టల్‌ను రూపొందించిన ఏపీ డ్రోన్ కార్పోరేషన్
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ డ్రోన్ మార్ట్ సేవలు

2లో

## ఇండోనేషియాలో భారీ భూకంపం

- తులాల్ నగరానికి 117 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం
- రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతతో భూకంపం
- సునామీ వచ్చే అవకాశాలు లేవని వాతావరణ కేంద్రం వెల్లడి

2లో



# ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. డ్రోన్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించి ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ను సోమవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. డ్రోన్ మార్ట్ ద్వారా వ్యవసాయం సహా వివిధ రంగాల్లో డ్రోన్ల ద్వారా సేవలు పొందేందుకు పోర్టల్‌ను ఏపీ డ్రోన్ కార్పోరేషన్ రూపొందించింది. ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ద్వారా వ్యవసాయం, ఇన్ఫ్రా, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చు. ఇటీవల కాలంలో రైతులు తమ పొలాల్లో మందులు పిచికారీ చేయాలంటే డ్రోన్లు వినియోగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా పంటల పర్యవేక్షణ కూడా చేపట్టవచ్చు. ఇలాంటి సేవలను పోర్టల్ ద్వారా సాధారణ రైతులు సైతం వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఇప్పుడు అందరికీ కల్పిస్తోంది. అలాగే డ్రోన్లతో టెక్నాలజీని వినియోగించుకుని సర్వేలు చేపట్టడం, పెద్దఎత్తున పనులు చేపట్టే సందర్భంలో డ్రోన్లతో పర్యవేక్షించడం, సెక్యూరిటీ, మ్యాపింగ్ వంటి సేవలు డ్రోన్ల ద్వారా చేపట్టవచ్చు. ఈ తరహా సేవలను ఇకపై డ్రోన్ మార్ట్ ద్వారా పొందవచ్చు. డ్రోన్ మార్ట్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అందుబాటులోకి తెచ్చారు. డ్రోన్ సేవలు అవసరమైన వారికి సర్వీస్ ప్రొవైడర్లను డ్రోన్ మార్ట్ పోర్టల్ అందుబాటులోకి తెస్తుంది. ప్రభుత్వ విభాగాలను.. వివిధ సంస్థలను.. సర్వీస్ ప్రొవైడర్లను ఈ పోర్టల్ అనుసంధానం చేస్తుంది.

# భూమి పైకి శుభాంశు శుక్లా సహా వ్యోమగాములు తిరుగు ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం నుంచి భూమికి వచ్చేందుకు వీలుగా శుభాంశు బృందం డ్రాగన్ వ్యోమనౌకలోకి చేరుకుంది. నలుగురు వ్యోమగాములు తమ తమ స్థానాల్లో కూర్చున్నారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం గం. 4.35 నిమిషాలకు వ్యోమనౌక అంతరిక్ష కేంద్రంతో విడిపోనుంది. అనంతరం భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంది. వ్యోమనౌక దాదాపు 21 గంటల పాటు ప్రయాణించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి సమీపంలో సముద్ర జలాల్లో దిగుతుంది. అనంతరం వారిని అక్కడి నుంచి క్వారంటైన్‌కు తరలిస్తారు. దాదాపు వారం రోజుల పాటు వ్యోమగాములు ఫ్లైట్ సర్జన్ పర్యవేక్షణలో ఉంటారు. యాక్సియం 4 మిషన్‌లో భాగంగా శుభాంశు బృందం గత నెల 25న నింగిలోకి వెళ్లగా, 28 గంటల ప్రయాణం అనంతరం అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించింది. వీరి బృందం దాదాపు 15 రోజుల పాటు పలు ప్రయోగాలు చేసింది. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై అధ్యయనం నిర్వహించింది.

# గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు..

(మొదటిపేజీ తరువాయి)

కవీందర్ గుప్తాలను కేంద్రం నియమించింది. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ అధికారికంగా ప్రకటించింది. విజయనగరానికి చెందిన అశోక్ గజపతి రాజు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకుడు మరియు పొలిట్ బ్యూరో సభ్యుడు. గతంలో ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. రాజకీయంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన, విజయనగరం రాజవంశానికి చెందిన ప్రముఖ వ్యక్తి. ఆయన గోవా గవర్నర్‌గా నియమితులవడంపై టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక, హర్యానా గవర్నర్‌గా ఇప్పటివరకు బండారు దత్తాత్రేయ సేవలందిస్తూ వచ్చారు. ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్‌ను కేంద్రం నియమించింది. విద్యారంగంలో ప్రముఖుడైన ఘోష్, ఈ కీలక పదవిని చేపట్టనున్నారు. అలాగే, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి గవర్నర్‌లుగా పనిచేసిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో 20 మంది తెలుగు వారు గవర్నర్‌లుగా సేవలందించారు. వీరిలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ప్రముఖులు కూడా ఉన్నారు.

# అశోక్ గజపతిరాజుకు కంగ్రాట్స్ చెప్పిన సీఎం చంద్రబాబు

* **గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు**
* **ఏపీ ప్రజలకు గర్వకారణమన్న సీఎం చంద్రబాబు**
* **అశోక్ గజపతిరాజు గవర్నర్ గా విజయవంతం అవ్వాలంటూ ట్వీట్**

పూసపాటి రాజకుటుంబీకుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా నియమితులవడం పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. "గోవా గవర్నర్ గా నియమితులైన పి.అశోక్ గజపతిరాజుకు హృదయపూర్వక శుభాభినందనలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఇది గర్వకారణం. అశోక్ గజపతి రాజుకు ఇంతటి గౌరవనీయ పదవిని ఇచ్చిన సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి, కేంద్ర క్యాబినెట్ కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ విశిష్ట పదవిలో అశోక్ గజపతిరాజు గారు విజయవంతం అవ్వాలని, పదవీకాలాన్ని పరిపూర్ణంగా నిర్వర్తిస్తారని ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.



* **రాజు గారి నియామకం రాష్ట్రానికే గర్వకారణం: నారా లోకేశ్**

టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అశోక్ గజపతి రాజు గారు సమగ్రత, నీతి, ప్రజా సేవకు అంకితభావం వంటి లక్షణాలతో గవర్నర్ కార్యాలయానికి గొప్ప గౌరవాన్ని తీసుకొస్తారని నమ్ముతున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు. రాజు గారి నియామకం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని ఆయన అభివర్ణించారు.

# యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గా మరాఠా సైనిక కోటలు!

(మొదటిపేజీ తరువాయి)





నుంచి 19వ శతాబ్దం వరకు నిర్మితమైన 12 కోటల సమూహం ఈ సీరియల్ నామినేషన్‌లో భాగం. మహారాష్ట్రలోని 11 కోటలు... సల్హేర్, శివనేరి, లోహగఢ్, ఖండేరి, రాయగఢ్, రాజగఢ్, ప్రతాపగఢ్, సువర్ణదుర్గ్, పన్హాలా, విజయదుర్గ్, సింధుదుర్గ్... మరియు తమిళనాడులోని జింజీ కోట ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కోటలు మరాఠా రాజులు, ముఖ్యంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క వ్యూహాత్మక సైనిక దృష్టిని మరియు స్వరాజ్య భావనను ప్రతిబింబిస్తాయి. ఈ కోటలు విభిన్న భౌగోళిక ప్రాంతాలలో... తీరప్రాంతాలు, కొండలు, ద్వీపాలలో నిర్మితమై, మరాఠా సామ్రాజ్యం యొక్క విస్తృత రక్షణ వ్యవస్థను ప్రదర్శిస్తాయి. జింజీ కోట, 'తూర్పు ట్రాయ్'గా పిలువబడే ఈ కోట, 17వ శతాబ్దంలో మొగలుల ఆక్రమణకు వ్యతిరేకంగా మరాఠా ప్రతిఘటనకు కీలక కేంద్రంగా నిలిచింది. కాగా, ఈ నామినేషన్‌కు అంతర్జాతీయ స్మారక స్థలాలు మరియు సైట్‌ల సంస్థ (ఐసీఓఎంఓఎస్) నుంచి మొదట 'తిరస్కరణ' సిఫార్సు వచ్చినప్పటికీ, భారత ప్రతినిధి బృందం ఈ సవాళ్లను అధిగమించి, సాంకేతిక న్యాయనిర్ణయాలతో ఈ గుర్తింపును సాధించింది. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర పురావస్తు శాఖ, మరియు డీఆర్ఓఎన్ఏహెచ్ సంస్థల సమన్వయంతో ఈ విజయం సాధ్యమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ గుర్తింపును 'దేశానికే గర్వకారణం'గా అభివర్ణించారు, ప్రజలను ఈ కోటలను సందర్శించి మరాఠా సామ్రాజ్య చరిత్రను తెలుసుకోవాలని కోరారు. ఈ గుర్తింపు భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచ వేదికపై మరింత ఉన్నతంగా నిలిపింది. మరాఠా కోటలు కేవలం సైనిక నిర్మాణాలు మాత్రమే కాక, ఆనాటి ఆర్థిక, సామాజిక జీవన విధానాలను కూడా ప్రతిబింబిస్తాయి. ఈ స్థలాలు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు, భారతీయ వారసత్వాన్ని రక్షించే బాధ్యతను ప్రజలకు గుర్తుచేస్తాయి.

# గోదావరి నీళ్లు ఇవ్వలేదు కానీ ముఖ్యమంత్రి వస్తే అడ్డుకుంటామని చెబుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం, గుర్తింపు, ఆకలితీర్చే ఆయుధమని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తే రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం దండుగ కాదని, పండుగ అని చెప్పడానికి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చినట్లు చెప్పారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని అన్నారు. గతంలో మూడు రోజులు అధికారం ఇస్తే తుంగతుర్తికి జలాలు తీసుకువస్తామని చెప్పారని, కానీ పదేళ్లు అధికారంలో ఉండి దేవాదుల నుంచి నీళ్లు తేలేకపోయారని విమర్శించారు.

# మంగళగిరిని గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల చాలెంజ్!

అధికారులు చాలెంజ్‌గా తీసుకుని వంద రోజుల్లో గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. స్వచ్ఛతలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దేలా సుమారు రూ. 4.4 కోట్ల విలువైన ఐదు అధునాతన వాహనాలను లోకేశ్ లాంఛనంగా ప్రారంభించారు. చెత్తను తరలించేందుకు రెండు రిఫ్యూజ్ కాంపాక్టర్ మెషీన్ వాహనాలు, రెండు స్వీపింగ్ మెషిన్ వాహనాలతో పాటు బీటీ రహదారులపై గుంతలు పూడ్చే అధునాతన పాత్ హోల్ రోడ్ రిపేర్ వాహనానికి ఉండవల్లి నివాసంలో లోకేశ్ జెండా ఊపి ప్రారంభించారు. చెత్తను తరలించేందుకు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో వినియోగిస్తున్న రూ.1.91 కోట్ల విలువైన రెండు కాంపాక్టర్ వాహనాలు రాష్ట్రంలోనే మొదటిసారిగా మంగళగిరి నగరపాలక సంస్థకు అందుబాటులోకి వచ్చాయి. ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాలను ఈ కాంపాక్టర్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఎంటీఎంసీ పరిధిలో బీటీ రోడ్లపై ఎప్పటికప్పుడు గుంతలు పూడ్చేందుకు రూ.1.48 కోట్ల విలువైన పాత్ హోల్ రిపేర్ వాహనంతో పాటు సుమారు రూ.1.2 కోట్ల విలువైన రెండు స్వీపింగ్ మెషిన్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. స్వచ్ఛ మంగళగిరి సాధనకు ఈ అధునాతన వాహనాలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. మంగళగిరిని గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల చాలెంజ్‌ను అధికారులు స్వీకరించాలన్నారు. వంద రోజుల తర్వాత రోడ్లపై ఏమైనా గుంతలు ఉంటే వాట్సాప్ లేదా స్వచ్ఛాంధ్ర యాప్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా కసరత్తు చేయాలని ఆదేశించారు. లోకేశ్ చాలెంజ్‌ను తాము స్వీకరిస్తున్నామని, స్వచ్ఛతలో మంగళగిరిని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీం బాషా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేశ్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాన్, మంగళగిరి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వెంకట్, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి దారా దాసు, తాడేపల్లి రూరల్ టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, ఎంటీఎంసీ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ రాము తదితరులు పాల్గొన్నారు.



# ర్యాంకర్లను సన్మానించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

నీట్ యూజీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. రాజమండ్రికి చెందిన డి.కార్తీక్ రామ్ నీట్ యూజీ పరీక్షలో ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 19వ ర్యాంక్, ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించగా, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 113వ ర్యాంక్, రాజమండ్రికి చెందిన కంచుమర్తి ప్రణీత్ 311వ ర్యాంక్ సాధించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో ఉండవల్లిలోని తన నివాసంలో ఈ విద్యార్థులను కలిసిన మంత్రి నారా లోకేశ్, వారి ప్రతిభకు ముగ్ధులైనట్లు తెలిపారు. "తమ కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు" అని సోషల్ మీడియా వేదికగా ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాధనను కొనియాడిన మంత్రి, రాష్ట్రంలోని ఇతర విద్యార్థులకు వారు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఇండోనేషియాలో భారీ భూకంపం

ఇండోనేసియాలో భారీ భూకంపం సంభవించింది. తులాల్ నగరానికి 177 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతగా నమోదైంది. అయితే సునామీ వచ్చే అవకాశాలు లేవని వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ ఇండోనేషియాలో ఈ మధ్యాహ్నం 12:49 గంటలకు ప్రకంపనలు వచ్చాయి. ఈ భూకంపం కారణంగా అనేక ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వారు వెల్లడించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇండోనేసియాను నిత్యం భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు వెంటాడుతుంటాయి. 2004లో 9.1 తీవ్రతతో ఏర్పడిన భూకంపం కారణంగా ఒక్క ఇండోనేషియాలోనే 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతం 'రింగ్ ఆఫ్ ఫైర్'గా పిలిచే అగ్నిపర్వతాల జోన్‌లో ఉంది.

# అందుకు చైనాకు కృతజ్ఞతలు

సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్టోబర్ 2024లో మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారని, నాటి నుంచి సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. రెండు దేశాలు కూడా బాధ్యతాయుతంగా కొనసాగించాలని వ్యాఖ్యానించారు. క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకొని చర్చించుకుంటే రెండు దేశాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఐదేళ్ల విరామం అనంతరం మానససరోవర్ యాత్ర పునఃప్రారంభమైందని, ఇందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇందుకు చైనాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత తొమ్మిది నెలల్లో కీలక పురోగతి సాధించామని, సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చూసుకున్నామని ఆయన అన్నారు. ఆర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళితే త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని జైశంకర్ అన్నారు. భారత్, చైనా సంబంధాలు ప్రపంచానికి కూడా మేలు చేస్తాయని అభిప్రాయపడ్డారు. రేపు జరగనున్న సమావేశంలో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాదం తదితర అంశాలపై చర్చ జరగాల్సి ఉందని అన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలనే కృత నిశ్చయంతో భారత్ ఉందని జైశంకర్ అన్నారు. విదేశాంగ మంత్రిగా ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత వాంగ్ యీపై ఉందని అన్నారు.

# తెలంగాణలో బిజెపి ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

* **చౌటుప్పల్ లో ఘన స్వాగతం**
* **బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు రామచంద్రరావు**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా నల్గొండ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయనకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సోమవారం ఘనస్వాగతం లభించింది. ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షురాలు కడారి కల్పన, రూరల్ అధ్యక్షుడు కైరంకొండ అశోక్ ల ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రామచంద్రరావుకు వీరతిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. గజమాలతో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో రామచంద్రరావు మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణ యుగం తెస్తుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అమలు కానీ హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఆ హామీల అమలులో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పార్టీ డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సివెల్ల మహేందర్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్, దోనూరి వీరారెడ్డి, పాశం భాస్కర్, దూడల భిక్షం గౌడ్, రమనగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, శాగ చంద్రశేఖర్ రెడ్డి, రమనగోని దీపిక, ముత్యాల భూపాల్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, రిక్కల సుధాకర్ రెడ్డి, దిండు భాస్కర్, కాయితీ రమేష్, మునగాల తిరుపతిరెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్, పబ్బు వంశీ, ఉబ్బు భిక్షపతి, కాసుల వెంకటేశం, కడవేరు పాండు, కడారి ఐలయ్య, సంస్థాన్ నారాయణపురం అధ్యక్షుడు సుర్వి రాజు, మునుగోడు అధ్యక్షుడు పెంబల్ల జానయ్య, గట్టుప్పల్ అధ్యక్షుడు రావుల ఎల్లప్ప, యాస అశోక్ రెడ్డి, బుద్ద సురేష్, గోశిక నీరజ, ఉష్కాగుల నాగరాజు, ఊడుగు విజయలక్ష్మి, పర్నేగాయత్రి, పోలోజు గాయత్రి, నూనె మాధవి, రేవల్లి స్వప్న, నాగమణి, సాయి, పబ్బతి శేఖర్, రమాకాంత్, జి. వేణు సీనియర్ నాయకులు, పదాధికారులు, బూత్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షులు భాష**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షులు భాష కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి పెద్దపీట వేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీకి ఎప్పుడు రుణ పడి ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికలలో దూదేకుల ను గుర్తించి అర్హులు అయినా వారికి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ దూదేకుల కులస్తులకు అన్ని రకాలుగా ఆదుకోవాలని మేడ్చల్ జిల్లా మైనారిటీ ప్రజల తరుపున కోరుతున్నామని తెలిపారు.

## ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి కలెక్టరు (96) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం

* **పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ కి చెందిన పూర్ణచందర్ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.14,000ల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా పీఎసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అనక్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదన్నారు. అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా.. సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ,మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాయి నేనీ చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్, పురెందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ పైనుంచి దూకి.. విద్యార్థిని ఆత్మహత్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: హాస్టల్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌటుప్పల్ మండలంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిలు తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం, విఠలాపురం గ్రామానికి చెందిన వూరబాయి పరశురాములు జయమ్మ దంపతులకు నలుగురు అమ్మాయిలే సంతానం. సంధ్య(11) చిన్న కూతురు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామపంచాయతీ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల ప్రభుత్వ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో చేర్పించారు. గత ఏప్రిల్ 19న 5వ తరగతిలో అడ్మిషన్ తీసుకున్నారు. ఈ నెల 5న పాఠశాలకు హోమ్ సిక్ హాలిడేస్ ప్రకటించారు. సంధ్య సహా పాఠశాల విద్యార్థులంతా తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులంతా ఈ నెల 13న తిరిగి వసతి గృహానికి వచ్చేశారు. సంధ్యను కూడా అదేరోజు ఆమె తల్లి జయమ్మ హాస్టల్ వద్ద వదిలేసి వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున వసతి గృహం 4వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు చేసుకుంది. పాఠశాల సిబ్బంది సోమవారం ఉదయం 7గంటలకు విద్యార్థులకు "రోల్ కాల్" చేసే సమయంలో సంధ్య ఆత్మహత్య విషయం వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థులంతా నిద్రలోకి జారుకున్నాక సంధ్య వసతి గృహం నాలుగో అంతస్తు టెర్రస్ పైకి ఎక్కి కిందకు దూకింది. ఆ ప్రాంతంలో బండ రాళ్లు ఉండటంతో తలకు బలమైన గాయాలు తగిలి సంధ్య అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి విద్యార్థిని తల్లిదండ్రులకు, చౌటుప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గేద, ఆవు పాల కంటే మేక పాలు శ్రేష్టం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గేద, ఆవు పాల కంటే మేకపాలు ఎంతో శ్రేష్టమైనవని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ఫుడ్ కోర్ట్ నందు మహిళా శక్తి క్యాంటీన్ లో మేకపాల విక్రయ స్టాల్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా శక్తి క్యాంటీన్ సభ్యులతో ముచ్చటించి మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా వారు విక్రయిస్తున్న ఆహార పదార్థాల వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం వారు ఇచ్చిన మేకపాలను త్రాగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల కు వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా మేకపాలు త్రాగించాలని ఇవి ఎంతో శ్రేష్టమైనవి , స్వచ్ఛమైనవి అని అన్నారు. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల మేకలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మార్కెట్లో గేద, ఆవు పాలు లీటర్ 80 రూపాయల వరకు ధర ఉన్నదని అదే ధరకు మేకపాలు కూడా విక్రయించవచ్చని ఇవి ఎంతో ఆరోగ్యకరమని తెలిపారు. జిల్లాలోని రైతులు ముందడుగు వేసి లీటర్ నుండి ప్రారంభించినప్పటికీ రైతులకు 3000 నుంచి 4000 రూపాయలు అదనపు ఆదాయం కూడా లభిస్తుంది అన్నారు. ఈ మేకపాలను విక్రయించడం ప్రారంభించడం ద్వారా జిల్లాలో సంవత్సరానికి 50 కోట్ల వ్యాపారానికి అవకాశం ఉందన్నారు. జిల్లాలో మేకల పెంపకానికి పశు గ్రాసానికి అనువైనది అన్నారు. నగరాల్లో మేకపాలతో పన్నీరు, చీజ్ వంటివి తయారుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని మన ప్రాంతంలో కూడా వీటిని వినియోగించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని రైతులు ఈ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్లు ఆనందరావు, బాలకృష్ణ, రామకృష్ణ మరియు సంతోష్, గోపాలమిత్ర సత్యనారాయణ , మహిళా శక్తి క్యాంటీన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో విత్తనాలు చల్లిన రామవరం పాఠశాల విద్యార్థులు

* **జిల్లాలో విస్తృతంగా విత్తనాల సేకరణ కార్యక్రమం**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మార్గదర్శనంలో, ప్రకృతి పరిరక్షణకు భాగస్వాములుగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో, ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విత్తనాల సేకరణ పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆచరణాత్మకంగా తీసుకుంటూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన విత్తనాలను సోమవారం సుజాత నగర్ మండలం గరీబ్ పేట్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో జల్లడం జరిగింది.విద్యార్థులు స్థానికంగా సేకరించిన టేకు, చింత, గానుగ, వేప మరియు పనస విత్త నాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి వాటిని అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా పునరావసం చేయాలని దృష్టితో చల్లారు. వర్షాకాలాన్ని అనుకూలంగా భావించి, విత్తనాల అభివృద్ధికి సహాయకంగా ఉండే ప్రదేశాలను అటవీ శాఖ సహకారంతో గుర్తించి అక్కడ చల్లడం జరిగిందని రామవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రభుదయాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్ బాబు, శంకర్ , ఇతర సిబ్బందితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ ఆందోల్ మైసమ్మ బోనాలోత్సవం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం శివారులోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బోనాలోత్సవం సోమవారం ముగిసింది. చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి, ఈవో ఎస్ మోహన్ బాబులు బోనాలు ఉత్సవానికి సహకరించిన దాతలకు, దేవస్థానం కమిటీ సభ్యులకు శాలువాలతో సన్మానం చేశారు. జ్ఞాపికలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుర్ర స్వామి, అత్తాపురం అంజిరెడ్డి, చిట్టంపల్లి జంగయ్య, కంచర్ల ప్రవీణ్ రెడ్డి, సోమ రాఘవేందర్ రెడ్డి, ఎలవర్తి రవీందర్, గుండ్ల అశోక్, ఎల్లంకి రమేష్ చారి, సంగం యాదమ్మ మల్లేష్, ఫకీరు గణేష్ రెడ్డి, చేపూరి మహేష్, ఈడ్దుల లింగస్వామి ,పబ్బు కిరణ్ గౌడ్ ,శివప్రసాద్ శర్మ అర్చకులు, సిబ్బంది గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యాలయంపై దాడి.. కవితపై మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసిన తీన్మార్ మల్లన్న

- * నిన్న క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి
- * కవిత అనుచరులు విధ్వంసం సృష్టించారని మండలి చైర్మన్‌కు ఫిర్యాదు
- * తనకు రక్షణ కల్పించాలని చైర్మన్‌ను కోరినట్లు తీన్మార్ మల్లన్న వెల్లడి

నిన్న తనపై హత్యాయత్నం జరిగిందని, ఈ విషయంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. కవిత అనుచరుల విధ్వంసాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆదివారం క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి జరిగింది. ఈరోజు మండలి చైర్మన్‌ను కలిసిన మల్లన్న దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనుచరులు క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చి చేసిన విధ్వంసాన్ని



చైర్మన్‌కు వివరించానని తెలిపారు. డీజీపీని కూడా కలిసి ఫిర్యాదు చేస్తానని ఆయన వెల్లడించారు. కార్యాలయంపై దాడి నేపథ్యంలో తనకు రక్షణ కల్పించాలని చైర్మన్‌ను కోరానని తీన్మార్ మల్లన్న తెలిపారు. కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దాడి ఘటనపై విచారణ జరుపుతామని మండలి చైర్మన్ హామీ ఇచ్చారని వెల్లడించారు. కవిత బీసీ నినాదం వినిపించడంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. బీసీల కట్టుబాట్లు, పదజాలం ఏమిటో కవితకు తెలియదని వ్యాఖ్యానించారు. బీసీల రాజకీయాన్ని నిలువరించాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ నినాదం ఎత్తుకున్నారని ఆరోపించారు. మరోవైపు, క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి కేసు నేపథ్యంలో పోలీసు శాఖ తీన్మార్ మల్లన్నకు చెందిన ఇద్దరు గన్‌మన్లను సరెండర్ చేసింది. పోలీసు శాఖ ఇద్దరి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. తీన్మార్ మల్లన్న చెబితే తాము కాల్పులు జరిపామని పోలీసులు విచారణలో తెలిపారు. అంతకుముందు, తీన్మార్ మల్లన్న ఈ దాడిపై మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు కవితపై కేసు నమోదు చేశారు.

## పాపిరెడ్డి నగర్ లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

* ఎమ్మెల్యేకు వెల్ఫేర్ సభ్యుల వినతి

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లో పొంగిపోరాలుతున్న భూగర్భ డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్క రించాలంటూ సోమవారం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరకెపూడి గాంధీని కలిసి వినతి పత్రం అందిస్తూ విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపిరెడ్డి నగర్ లో ని బి.బ్లాక్ రోడ్ నెంబర్ 01,02 లలో నూతన భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయడం ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చంద్ర రెడ్డి ఎమ్మెల్యే కు వివరించారు. సమ స్యను సంబంధిత విభాగం అధికారుల దృష్టికి



తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించాలన్న ఆదే శాలను జారీ చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, అధ్యక్షులు ఆడెపు ప్రభాకర్ , నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అత్తింటి వేధింపులు భరించలేక డెంటిస్ట్ ఆత్మహత్య

హసన్‌పర్తి: అత్తింటి వేధింపులు భరించలేక ఓ దంత వైద్యురాలు (డెంటిస్ట్) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా కమలాపూర్ మండలం మంగపేటకు చెందిన వైద్యుడు సృజన్‌తో వరంగల్‌కు చెందిన డెంటిస్ట్ ప్రత్యూషకు 2017లో వివాహమైంది. పెళ్లి సమయంలో వరుడికి రూ.30లక్షల కట్నం, 30 తులాల బంగారం, ఖరీదైన కారు ఇచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్న ఈ కుటుంబం.. గతేడాది హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్‌లో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితం



సృజన్‌కు హనుమకొండకు చెందిన ఓ యువతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడమేకాకుండా భార్య ప్రత్యూషను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. అత్తమామలు కూడా వారి కుమారుడికే మద్దతుగా నిలుస్తూ కోడల్ని వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష ఆదివారం భర్త ఇంట్లో ఉండగానే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త, స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. అయితే, ప్రత్యూష ఒంటిపై గాయాలు ఉండటంతో ఆమె తల్లిదండ్రులు హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రత్యూషది ఆత్మహత్య కాదని.. భర్త, అత్తమామలు చిత్రహింసలకు గురిచేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్

దిల్లీ: దేశంలో పలువురు ప్రధాన న్యాయ మూర్తులు, న్యాయమూర్తుల బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను రాష్ట్రపతి ఆమోదించడంతో కేంద్ర న్యాయశాఖ బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయన త్రిపుర హైకోర్టు సీజేగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఝార్ఖండ్ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావును త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. మద్రాస్, రాజస్థాన్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కూడా బదిలీ చేస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు



జారీ చేసింది. మరోవైపు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేశారు. గతంలోనూ ఆయన ఏపీ హైకోర్టు జడ్జిగా పనిచేశారు.

## శంకరమంచి రామకృష్ణశాస్త్రికి తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం

హైదరాబాద్: శృంగేరి పీఠ ఆస్థాన జ్యోతి ర్విద్వాంసులు బ్రహ్మశ్రీ డాక్టర్ శంకరమంచి రామకృష్ణశాస్త్రిని తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం వరించింది. శృంగేరి ఉభయ జగద్గురువుల అనుగ్రహంతో, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో నిర్వహించిన తెలంగాణ విద్వత్సభ నవమ వార్షిక విద్వత్సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. పుష్పగిరి జగద్గురు మహాసంస్థానంలో (బేగంపేట) ఆదివారం ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి సమక్షంలో రామకృష్ణశాస్త్రిని సత్కరించారు. విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ, ఉపాధ్యక్షులు జనగామ సిద్ధాంతి సంపత్ కుమార కృష్ణమాచారి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి




పర్యవేక్షణలో జరిగిన ఈ సభకు దర్భనం శర్మ సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో వనం జ్వాలా నరసింహమూర్తి, పూర్వ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, యాదాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు, వెంకటేశ్వర శర్మ, వెన్నంపల్లి జగన్మోహన శర్మ, సాగి కమలాకర శర్మ, గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, సంధ్యాలక్ష్మి తదితర ప్రముఖులు, పండితులు పాల్గొన్నారు. డాక్టర్ శంకరమంచి రామకృష్ణశాస్త్రికి ఈ విశిష్ట పురస్కారం లభించడంపై విద్యావేత్తలు, పండితులు హర్షం వ్యక్తంచేశారు.

## సైబర్ మోసం.. రిఫండ్ చేస్తామని వృద్ధురాలి నుంచి డబ్బు కొట్టేశారు



హైదరాబాద్: అమెజాన్‌లో కొనుగోలు చేసిన వస్తువును రిటర్న్ చేయాలని ప్రయత్నించిన ఓ వృద్ధురాలిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఆమె నుంచి రూ.1.07లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు ఇటీవల అమెజాన్‌లో ఓ వస్తువుని కొనుగోలు చేశారు. దాన్ని రిటర్న్ చేసి రిఫండ్ తీసుకోవాలని కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికారు.ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు ఆమెకు ఫోన్ చేసి రిఫండ్ చేస్తామని నమ్మించారు. స్క్రీన్ షేరింగ్ యాప్ డౌన్‌లోడ్ చేయించి బాధితురాలి మొబైల్‌ను అధీనంలోకి తీసుకున్నారు. రిఫండ్ కావట్లేదని, బ్యాంకు వివరాలు ఇవ్వాలని కోరడంతో వారికి ఆమె తన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇచ్చారు. వెంటనే ఆ రెండు బ్యాంక్ ఖాతాల్లోంచి రూ.1.07లక్షలు డెబిట్ అయ్యాయి. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు.. హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి: మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

రెజిమెంటల్ బజార్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి మహిళా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద అందుబాటులో లేకపోవడంతో కమిషన్ సభ్యులు సుదం లక్ష్మి, రేవతి రావు, ఉమ, అఫ్రోజ్ షహీనాకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ముందస్తు సమాచారం ఇచ్చినా ఛైర్‌పర్సన్ అందుబాటులో లేకపోవడంపై జాగృతి నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఛైర్ పర్సన్ అందుబాటులో



లేరని చెబుతూ సెక్రటరీ సైతం ఫిర్యాదు లేఖను తీసుకోవడానికి అంగీకరించలేదని వారు ఆరోపించారు. మహిళలను కించపరిచే వ్యక్తుల విషయంలో ఇలాంటి వైఖరి మంచిది కాదన్నారు. స్పందించిన కమిషన్ సభ్యులు ఫిర్యాదును స్వీకరించి ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మరిపల్లి మాధవి, సీనియర్ నాయకులు వరలక్ష్మి, పడాల మనోజ, దేశపాక సుచిత్ర, సంధ్య రెడ్డి, షాహీన్, పరమేశ్వరి, కుసుమ రజిత, రజితా రెడ్డి తదితరులు ఉన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే మా లక్ష్యం : డిప్యూటీ సీఎం

తెలంగాణలో ఒక్క కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదని, ప్రతి పేద కుటుంబానికి ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో మధిర నియోజకవర్గ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించండి. ప్రతివారం ఇంటి బిల్లులు చెల్లిస్తాం. మీరు ఎంత వేగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే, అంత త్వరగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఇళ్ల నిర్మాణం పండుగలా జరుపుకోవాలి. గృహప్రవేశానికి పిలిస్తే తప్పక వస్తాను," అని తెలిపారు. ప్రతి



పేద కుటుంబానికి ఇల్లు, ప్రతి మహిళకు ఆర్థిక స్థిరత్వం కల్పించాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉందని ఆయన పేర్కొన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పేదల కష్టాలను స్వయంగా చూశానని, పేదల ఇంటి కలను నెరవేర్చే ప్రభుత్వం ఇదే అని స్పష్టం చేశారు. ప్రతి ఇంటిని రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు ఒకే సంవత్సరం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

## నామినేటెడ్ పోస్టుల భర్తీకి యుద్ధ ప్రాతిపదికన చర్యలు : మంత్రి పొన్నం

నామినేటెడ్ పోస్టుల భర్తీకి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని పీసీసీ మెదక్ జిల్లా ఇంఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై గాంధీ భవన్ లో కీలక సమావేశం నిర్వహించారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్, నియోజకవర్గ ఇంచార్జీలు, జనరల్ సెక్రెటరీలు, అబ్జర్వర్లతో సమావేశమై మంత్రి మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నేతలు ,మండల అధ్యక్షుల రేసులో ఉన్న ఆశావహులు, జిల్లా కార్యవర్గం ఆశావహులు, అనుబంధ సంఘాల ఆశావాహులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. పార్టీలో కష్టపడిన వారికే పదవులు వస్తాయని తెలిపారు. ముందు నుండి పార్టీలో యాక్టివ్ గా ఉన్న వారికి మండల అధ్యక్షుల రేసులో అవకాశాలు వస్తాయని తెలిపారు. ఏఐసీసీ తెలంగాణ ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఈనెల 15 లోపు సంస్థాగత నిర్మాణం పూర్తి



చేసేలా తుది కసరత్తు నిర్వహించారు. అందులో భాగంగా గ్రామ శాఖ అధ్యక్షుల నుండి వార్డు, బ్లాక్ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గం, అనుబంధ సంఘాల నియామకం పూర్తి చేసేలా ముఖ్య నేతలతో చర్చించారు. నియోజకవర్గ ఇంఛార్జీలు ఇచ్చిన షార్ట్ లిస్ట్ పై కసరత్తు పూర్తి చేసి పీసీసీ, ఏఐసీసీ ఇంఛార్జీలకు పంపించనున్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులు త్వరలోనే పూర్తి అయ్యేలా కసరత్తు జరుగుతుందని, పార్టీ కోసం పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయని వెల్లడించారు. నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా చాలా మండలాల్లో మార్కెట్ కమిటీలు, పట్టణ అభివృద్ధి కమిటీలు, దేవాలయ కమిటీలు, తదితర కమిటీలు పెండింగ్లో ఉన్న వాటిపై ఈ నెలాఖరు లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ప్రతి గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా నేతలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చారిత్రాత్మకంగా తీసుకున్న నిర్ణయం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిందని దీని ద్వారా కొత్త నాయకత్వానికి కూడా అవకాశాలు వస్తాయని వెల్లడించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటి నుండే పని చేయాలని సూచించారు.

# షేక్ హసీనాకు మరో షాక్.. కుమార్తెను సెలవుపై పంపిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

* ప్రపంచ ఆరోగ్య సంస్థలో విధులు నిర్వహిస్తున్న సైమా వాజెద్
* బంగ్లాదేశ్‌లో సైమా వాజెద్‌పై అవినీతి కేసులు నమోదు
* అధికార దుర్వినియోగం, మోసం, ఫోర్జరీ అభియోగాలు

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థలో విధులు నిర్వహిస్తోన్న ఆమె కుమార్తె సైమా వాజెద్ ను సెలవుపై పంపించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆమెపై అవినీతి కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయం



ఢిల్లీలో ఉంది. సైమా స్థానంలో డాక్టర్ కేథరీనా బోహ్మే తాత్కాలిక బాధ్యతలు స్వీకరించారు. సైమా వాజెద్ డబ్ల్యుహెచ్‌వో ఆగ్నేయాసియా రీజినల్ డైరెక్టర్‌గా ఉన్నారు. అయితే, మీడియా అడిగిన ఓ ప్రశ్నకు, ఆమె ప్రస్తుతం సెలవులో ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారులు సమాధానమిచ్చారు. బంగ్లాదేశ్‌లోని అవినీతి నిరోధక కమిషన్ షేక్ హసీనా కుమార్తెపై అధికార దుర్వినియోగం, మోసం, ఫోర్జరీ అభియోగాలను మోపింది. షేక్ హసీనాను స్వదేశానికి రప్పించేందుకు బంగ్లాదేశ్ ప్రయత్నిస్తోంది. ఈ సమయంలో మాజీ ప్రధానికి ఇది మరో ఎదురుదెబ్బ. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ ప్రెస్ సెక్రటరీ షఫీఖుల్ అలామ్ తెలిపారు.



## రష్యాలోని ఆ ప్రాంతంలో 10 లక్షల మంది భారతీయులకు ఉపాధి

* కార్మిక శక్తి కొరతను అధిగమించేందుకు భారత్ వైపు రష్యా దృష్టి
* ఉరల్ పర్వత సమీపంలోని యాకటెరిన్ బర్గ్ ప్రాంతంలో కార్మికుల కొరత
* యాకటెరిన్ బర్గ్‌లో కొత్త కాన్సులేట్ జనరల్ ప్రారంభించనున్న రష్యా

ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు రష్యా ఉపాధి కల్పించనున్నట్లు సమాచారం. తమ దేశంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికశక్తి కొరతను అధిగమించేందుకు రష్యా భారత్ వైపు దృష్టి సారిస్తోంది. రష్యాలో యాకటెరిన్‌బర్గ్ నగరంలో ఒక నూతన కాన్సులేట్ జనరల్ కార్యాలయం ప్రారంభం కానుంది. ఇది వలస కార్మికులకు సంబంధించిన అంశాలను పరిశీలించనుంది. ఈ మేరకు ఉరల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చీఫ్ అంద్రీ బెసెడిన్ మీడియాకు తెలియజేశారు. రష్యాలోని ఉరల్ పర్వతాలు సమీపంలో యాకటెరిన్‌బర్గ్ ప్రాంతం ఉంది. ఇది భారీ పరిశ్రమలకు కేంద్రం. అక్కడ మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కూడా ఉంది. ఈ ప్రాంతంలోని పరిశ్రమలు ఉత్పత్తిని పెంచవలసిన అవసరం ఉందని అంద్రీ బెసెడిన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత్‌తో పాటు శ్రీలంక, ఉత్తర కొరియా నుంచి కార్మికులను రప్పించాలని రష్యా భావిస్తోంది. రష్యాలో కార్మికుల కొరత ఉన్నందున భారత్‌తో సహా ఇతర దేశాల వైపు చూస్తోంది.

# ప్రాథమిక నివేదిక కొత్త ప్రశ్నలను లేవనెత్తింది
## : ఎయిరిండియా ఎండీ కాంప్‌బెల్ విల్సన్

* జూన్ 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం
* టేకాఫ్ తీసుకున్న వెంటనే కుప్పకూలిన ఎయిరిండియా విమానం
* 260 మంది మృతి
* ప్రాథమిక నివేదికతో కలకలం
* స్పందించిన ఎయిరిండియా ఎండీ

అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై విడుదలైన ప్రాథమిక నివేదిక కొంత స్పష్టతను అందించినప్పటికీ, కొత్త ప్రశ్నలను కూడా లేవనెత్తిందని ఎయిర్ ఇండియా ఎండీ, సీఈఓ కాంప్‌బెల్ విల్సన్ తన ఉద్యోగులకు రాసిన సందేశంలో తెలిపారు. ఈ దుర్ఘటనలో 241 మంది ప్రయాణికులు, 19 మంది భూమిపై ఉన్నవారు సహా మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. "ఈ నివేదికలో విమానం లేదా దాని ఇంజన్‌లలో యాంత్రిక లేదా నిర్వహణ సమస్యలు ఏవీ లేవని, ఇంధన నాణ్యతలో



సమస్యలు లేవని, టేకాఫ్ సమయంలో అసాధారణతలు లేవని తేలింది. పైలట్లు ప్రీ ఫ్లైట్ బ్రీత్‌లైజర్ పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు, వారి వైద్య స్థితిలో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక స్పష్టం చేసింది. అయితే, విమానం టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలో రెండు ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయిందని, ఇంజన్ ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు 'రన్' నుంచి 'కటాఫ్' స్థితికి మారినట్లు నివేదిక తెలిపింది. ఈ స్విచ్‌లు మారడం వెనుక కారణం పైలట్ తప్పిదమా, యాంత్రిక లోపమా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు... ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది" అని కాంప్‌బెల్ విల్సన్ వివరించారు. ఈ నివేదిక ఆధారంగా ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని కాంప్‌బెల్ విల్సన్ తమ ఉద్యోగులకు సూచించారు. "మీడియాలో వస్తున్న ఊహాగానాలపై దృష్టి పెట్టకుండా, విమాన భద్రతపై మనం దృష్టి సారించాలి" అని ఆయన అన్నారు. డీజీసీఏ పర్యవేక్షణలో ఎయిర్ ఇండియా యొక్క అన్ని బోయింగ్ 787 విమానాలను తనిఖీ చేసినట్లు, అవన్నీ ప్రయాణాలకు అనుకూలంగా ఉన్నట్లు విల్సన్ తెలిపారు. ఈ ప్రమాదం తర్వాత ఎయిర్ ఇండియా ప్రయాణికుల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు, భద్రతపై ఆందోళనలను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు కొత్త ఊహాగానాలు, సంచలనాత్మక వార్తలు రావచ్చని, అయినప్పటికీ సంస్థ విలువలైన సమగ్రత, శ్రేష్ఠత, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంపైనే దృష్టి పెట్టాలని విల్సన్ పిలుపునిచ్చారు.



## పైలట్లకు ఎతిహాద్ ఎయిర్ వేస్ హెచ్చరిక

గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఎయిరిండియా విమానం కూలి అందులోని 241 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేసిన నిపుణుల కమిటీ.. ఇంధన స్విచ్ లు ఆఫ్ కావడం వల్లే విమానం కూలిపోయిందని తేల్చింది. తాజాగా ఈ నివేదిక బయటపెట్టడంతో మిగతా విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. దీంతో బోయింగ్ విమానాల్లో ఇంధన సరఫరా స్విచ్‌లపై చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎతిహాద్ ఎయిర్ వేస్ తన పైలట్లకు అలర్ట్ నోటిఫికేషన్ జారీ చేసింది. బోయింగ్ 787 విమానాల్లోని ఇంధన స్విచ్ ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అదేసమయంలో తమ సంస్థకు చెందిన అన్ని విమానాల్లో ఇంధన స్విచ్ ల పనితీరును పరిశీలించేందుకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు.. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు

* ఇలాంటి ప్రసంగాలను కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్న ధర్మాసనం
* కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు
* వాక్ స్వాతంత్ర్యం విలువలు ప్రజలు తెలుసుకోవాలన్న సుప్రీంకోర్టు

విద్వేషపూరిత ప్రసంగాల కేసులపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇటువంటి ప్రసంగాలను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అదే సమయంలో భావప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించకూడదని స్పష్టం చేసింది. వాక్ స్వాతంత్ర్యపు విలువలను పౌరులు తెలుసుకొని, విద్వేషపూరిత ప్రసంగాల పట్ల సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలిపై వజహత్ ఖాన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. విద్వేషపూరిత ప్రసంగాలు చేసేవారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. ఇటువంటి వ్యాఖ్యలను షేర్ చేయకుండా కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ప్రజలు కూడా ఇటువంటి వాటిని షేర్ చేయకుండా సంయమనం పాటించాలని సూచించింది. ఇక్కడ సెన్సార్‌షిప్ గురించి మాట్లాడటం లేదని, కానీ ప్రజలు మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాలని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో విభజన ధోరణిని అడ్డుకోవాలని వ్యాఖ్యానించింది. భావప్రకటనా స్వేచ్ఛపై బాధ్యతాయుతమైన



ఆంక్షలు సరైనవేనని సుప్రీంకోర్టు పేర్కొంది. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు కోరింది.

## 44 ఏళ్ల కెరీర్‌లో నేర్చుకున్నదిదే..
## : ఆనంద్ మహీంద్రా

మనిషి నిత్య జీవన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు. ముఖ్యంగా వృత్తి జీవితంలో ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు. మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నింటా ఉరుకులు పరుగులే. తాజాగా ఇదే వ్యవహారంపై ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా కీలక ట్వీట్ చేశారు. కఠినమైన క్షణాలు, ఒత్తిళ్లు, వైఫల్యాలు.. జీవితంలో ఇవేవీ శాశ్వతం కావన్నారు. 44 ఏళ్లుగా కొనసాగుతున్న తన కెరీర్‌లో నేర్చుకున్న ముఖ్యమైన పాఠం ఇదేనని తెలిపారు. ''నా 44 ఏళ్ల కెరీర్‌లో నేర్చుకున్న ముఖ్యమైన విషయం ఏదైనా ఉందంటే.. అది 'ఏదీ శాశ్వతం కాదు' అనేదే. కఠినమైన క్షణాలు, ఒత్తిళ్లు, ఎదురుదెబ్బలు.. ఇవన్నీ వెళ్లిపోతాయి. సమస్యల సుడిలో చిక్కుకున్నప్పుడు.. దాన్నుంచి ఎప్పటికీ బయటపడలేమని అనిపించొచ్చు. కానీ.. పరిష్కారం లభిస్తుంది. సాధ్యమైనంత వరకు ఉత్తమంగా పని చేయడంపై దృష్టి సారించండి. స్థిరంగా ముందుకు కొనసాగండి. పరిస్థితులు మారతాయని విశ్వసించండి'' అని ఆనంద్



మహీంద్రా తన అనుభవ పాఠాన్ని పోస్ట్ చేశారు. ఆన్‌లైన్ వేదికగా ఆనంద్ మహీంద్రా అనేక ఆసక్తికర విషయాలు, స్ఫూర్తిదాయక కథనాలు పంచుకుంటారన్న విషయం తెలిసిందే. ఆయన తాజా పోస్ట్‌పై నెటిజన్లు స్పందిస్తూ.. మంచి సలహాలు ఇచ్చారంటూ కొనియాడారు. చేసే పనిలో స్థిరత్వం, నమ్మకం ముఖ్యమంటూ ఓ యూజర్ పేర్కొన్నారు. 44 ఏళ్ల కెరీర్‌పై పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# చదువులేని మొద్దు..
# తేజస్వీ యాదవ్ 'సూత్ర' వ్యాఖ్యపై బీజేపీ ఆగ్రహం

* మోదీని ఉద్దేశించి 'సూత్ర' పదాన్ని ఉపయోగించిన తేజస్వీ యాదవ్
* మోదీని అవమానించడంతోపాటు ఓ కులాన్ని అవమానించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్న బీజేపీ
* క్షమాపణలు చెప్పాల్సిందేనన్న బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ జైస్వాల్
* తన వ్యాఖ్యలను సమర్థించుకున్న తేజస్వీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి ఆర్జేడీ నాయకుడు 'సూత్ర' (సూత్రధారి) అనే పదం ఉపయోగించడాన్ని బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ జైస్వాల్ తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలను ఆయన అవమానకరమైనవిగా పేర్కొన్నారు.



తేజస్వీ యాదవ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం బీహార్ రాజకీయాల్లో మరోమారు దుమారం రేపింది. ఈ నెల 12న బీహార్ శాసనసభలో జరిగిన చర్చల సందర్భంగా తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని 'సూత్ర' అని సంబోధించారు. ఈ వ్యాఖ్యను బీజేపీ నాయకుడు సంజయ్ జైస్వాల్ అవమానకరంగా భావించారు. 'సూత్ర' అనే పదం హిందీలో 'సూత్రధారి' లేదా 'మాస్టర్‌మైండ్' అనే అర్థంతో పాటు, కొన్ని సందర్భాలలో కుల ఆధారిత అవమానకరమైన అర్థాన్ని కలిగి ఉంటుంది. ప్రధాని మోదీని అవమానించే ఉద్దేశంతోనే తేజస్వీ ఈ పదాన్ని ఉపయోగించారని జైస్వాల్ ఆరోపించారు. తేజస్వీ యాదవ్ చదువులేని మొద్దు అని జైస్వాల్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మోదీ గౌరవాన్ని కించపరచడంతోపాటు బీహార్‌లోని ఒక నిర్దిష్ట కులాన్ని అవమానించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని దుమ్మెత్తిపోశారు. తన వ్యాఖ్యలపై తేజస్వీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే, తేజస్వీ మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. రాజకీయాల్లో మోదీ 'సూత్రధారి' అని ఉద్దేశంతోనే తాను ఆ వ్యాఖ్యలు చేశానని, దానిని కులానికి ఆపాదించడం సరికాదని స్పష్టం చేశారు.



## అలనాటి నటి సరోజాదేవి కన్నుమూత

ప్రముఖ నటి బి.సరోజాదేవి కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 87 సంవత్సరాలు. వృద్ధాప్యం కారణంగా పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ఈ రోజు ఉదయం బెంగళూరులోని తన నివాసంలో సరోజాదేవి తుదిశ్వాస వదిలారు. పదమూడేళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సరోజాదేవి.. తన కెరీర్ లో 200 లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. సరోజాదేవి తెలుగు, కన్నడ, తమిళంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌లతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. సరోజాదేవి స్వస్థలం కర్ణాటకలోని బెంగళూరు. ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించి పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. తెలుగులో సీతారామ కళ్యాణం (1961) మరియు జగదేక వీరుని కథ (1961), మరియు దాగుడు మూతలు (1964), అమర శిల్పి జక్కన్న (1964) రహస్యం, పెళ్లి కానుక (1960), ఇంటికి దీపం ఇల్లాలే, మంచీ చెడు.. వంటి హిట్ సినిమాల్లో నటించారు.

# అమ్మకాల ఒత్తిడి.. నష్టాల్లో ముగిసిన సూచీలు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. ఐటీ స్టాక్‌ల అమ్మకాల ఒత్తిడితో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. సోమవారం ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. ఈ తర్వాత కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇక ఏ దశలోనూ మార్కెట్లు కోలుకోలేదు. చివరగా స్వల్పంగా కోలుకోవడంతో నష్టాలు స్వల్పంగా తగ్గాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,537.87 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఒక దశలో 82,010.38 పాయింట్లకు పడిపోయింది. చివరకు 247.01 పాయింట్లు పతనమై.. 82,253.46 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 67.55 పాయింట్లు తగ్గి 25,082.30 వద్ద స్థిరపడింది.

ట్రేడింగ్‌లో 1,991 షేర్లు లాభపడగా.. 2,020 షేర్లు పతనమయ్యాయి. జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, విప్రో, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. ఎటర్నల్, టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ ఇకశాతం తగ్గింది. ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా, రియాలిటీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం పెరిగాయి. ఇక సోమవారం డాలర్ మారకంతో పోలిస్తే రూపాయి 19 పైసలు తగ్గి 85.99 వద్ద ముగిసింది.

# త్వరలోనే భారత్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలు..




**న్యూఢిల్లీ:** ఎలాన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్ శాటిలైట్ ఆధారి ఇంటర్‌నెట్ సేవలో త్వరలో భారత్‌లో మొదలుకానున్నాయి. సేవలను ప్రారంభించేందుకు స్టార్‌లింక్ తుది ఆమోదాన్ని పొందింది. ఇప్పటికే స్టార్‌లింక్ సేవలు 100 కంటే ఎక్కువ దేశాల్లో అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. లైవ్ స్కై వ్యూతో ఎక్కడైనా సేవలు పని చేయనున్నాయి. దాంతో భారత్‌లో అత్యంత మారుమూల ప్రాంతాల్లోనూ ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులోకి రానున్నది. %×చీ-ూ౹ూజజు% (ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్) భారతదేశంలో ఐదు సంవత్సరాల పాటు వాణిజ్య కార్యకలాపాల కోసం స్టార్‌లింక్‌కు ఆమోదం తెలిపింది. 2030 జులై 7 వరకు చెల్లుబాటు కానున్నది.

కంపెనీ జెన్-1 ఉపగ్రహాల ద్వారా సేవలను అందించనున్న భారత్‌లో శాటిలైట్ ఇంటర్‌నెట్ సేవలు అందించేందుకు అనుమతి పొందిన మూడో కంపెనీగా స్టార్‌లింక్ నిలిచింది. ఇంతకు ముందు వన్‌వెబ్, జియోకు అనుమతి లభించింది. లైసెన్స్ మంజూరైనప్పటికీ స్టార్‌లింక్ ఇంకా గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించాల్సి ఉంటుంటి. అలాగే స్పెక్ట్రమ్‌ను పొందడంతో పాటు భద్రతా స్టాండర్డ్ తనిఖీలను సైతం పూర్తి చేయాల్సి ఉంటుంది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. ఈ ఏడాదిలోనే స్టార్‌లింక్ సేవలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. స్టార్‌లింక్ ఫైబర్ ఆప్టిక్ వంటి గ్రౌండ్-ఆధారిత మౌలిక సదుపాయాలపై ఆధారపడి నడవదు. వేలకొద్ది ఉపగ్రహాల నెట్‌వర్క్ ద్వారా శాటిలైట్ ఇంటర్‌నెట్ అందుతుంది. ఇవి లేజర్ ద్వారా ఒకదానితో అనుసంధానమవుతాయి. వేగంగా ఇంటర్‌నెట్‌ను అందిస్తుంది.

స్టార్‌లింక్‌తో జియో ఒప్పందం కుదుర్చుకుంది. రిటైల్ స్టోర్‌లలో డివైజ్‌లను విక్రయించాలని యోచిస్తున్నది. మారుమూల ప్రాంతాలలో ఇంటర్నెట్ అందించడానికి స్టార్‌లింక్‌తో సైతం ఎయిర్‌టెల్ ఒప్పందం చేసుకుంది. భారతదేశంలో స్టార్‌లింక్ బీఎస్ఎన్ఎల్ 'డైరెక్ట్ టు డివైజ్' పేరుతో పోటీ ఇస్తున్నది. శాటిలైట్, మొబైల్ నెట్‌వర్క్‌లను కనెక్ట్ చేయడం ద్వారా ఆండ్రాయిడ్ డివైజ్‌లలో నేరుగా ఇంటర్నెట్ అందించే సేవలపై కంపెనీ పని చేస్తున్నది. ఈ సాంకేతికతతో మారుమూల ప్రాంతాల్లోనూ మొబైల్ కనెక్టివిటీ సమస్యను పరిష్కారం కానున్నది. ఇదిలా ఉండగా.. స్టార్‌లింక్ హార్డ్‌వేర్ కిట్ (స్టాండర్డ్) రూ.30వేలు, హార్డ్‌వేర్ కిట్ (మినీ) రూ.43వేలు, ప్రమోషనల్ ప్లాన్ నెలకు రూ.900, అన్‌లిమిటెడ్ ప్లాన్ నెలకు రూ.3వేల వరకు ప్యాకేజీ ధర నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

# పతంజలి 6జీ స్మార్ట్‌ఫోన్ తీసుకురాబోతుందా?



**న్యూఢిల్లీ:** సోషల్ మీడియాలో ఇటీవల ఓ వార్త హల్‌చల్ చేస్తున్నది. ఇది అందరినీ షాక్‌కు గురి చేస్తున్నది. యోగా గురువు బాబా రాందేవ్ పతంజలి కంపెనీ తక్కువ ధరకు అత్యాధునిక ఫీచర్లతో 6జీ స్మార్ట్‌ఫోన్ విడుదుల చేయబోతుందని వార్త చక్కర్లు కొడుతున్నది. 250 మెగాపిక్సల్ మెయిన్ కెమెరా, 200 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ తదితర ఫీచర్ల స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న వివరాల ప్రకారం పతంజలి స్మార్ట్ మొబైల్ రియర్‌లో 250 మెగా పిక్సల్ ప్రైమరీ కెమెరా, 13మెగా పిక్సల్, 33 మెగా పిక్సల్ సపోర్టింగ్ కెమెరా, సెన్సార్లతో పాటు ఫ్రంట్‌లో 28 మెగా పిక్సల్ సెల్ఫీ కెమెరా, 6.74-అంగుళాల సూపర్ డిస్‌ప్లే (144 రిఫ్రెష్ రేట్), మీడియాటెక్ డైమెన్సిటీ 8200 ప్రాసెసర్, 12జీబీ ర్యామ్, టీబీ స్టోరేజ్, 7000 బ్యాటరీ, కేవలం 15 నిమిషాల్లో 100 శాతం చార్జ్ చేసే 200 ఛార్జింగ్ సపోర్ట్‌తో మొబైల్‌ను లాంచ్ చేనున్నారనే ప్రచారం జరుగుతున్నది.

ఈ ఫోన్ ధర కేవలం రూ.25వేల నుంచి రూ.33వేల వరకు ఉంటుందని.. పతంజలి యాప్‌లో ఫోన్‌లో ఇన్‌బిల్డ్ యాప్స్‌గా వస్తాయంటూ పలు నివేదికలు పేర్కొన్నాయి. అయితే, ఇందులో ఏమాత్రం నిజం లేదని తేలింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫేక్ అని మార్కెట్‌కు చెందిన పలువురు పేర్కొంటున్నారు. పతంజలి ఆయుర్వేదం, అనుబంధ సంస్థ ఇప్పటి వరకు అధికారికంగా స్మార్ట్‌ఫోన్ బిజినెస్‌లోకి వస్తున్నట్లు ప్రకటించలేదు. అయితే, ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 6జీ టెక్నాలజీ అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం పరిశోధనా, అభివృద్ధి దశలోనే ఉన్నది. ప్రపంచంలోని అతిపెద్ద టెక్ కంపెనీలు ఆపిల్, శామ్‌సంగ్ సైతం 6జీకి సైతం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో పతంజలి వంటి ఎఫ్ఎంసీజీ కంపెనీ అత్యాధునిక ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్ విడుదల చేయడం అసాధ్యమే. అయితే, సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న వార్తలపై ఇప్పటి వరకు కంపెనీ సైతం స్పందించలేదు.



# లార్డ్స్ టెస్ట్‌లో టీమిండియా ఓటమి..

## జడేజా పోరాటం వృథా..!



**లార్డ్స్:** ఇంగ్లండ్ వేదికగా లార్డ్స్ మైదానంలో ఉత్కంఠ భరితంగా సాగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. 22 పరుగుల తేడాతో భారత్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. టీమిండియా తరఫున ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చేసిన ఒంటరి పోరాటం వృథా అయ్యింది. ఈ మ్యాచ్‌లో విజయంతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 2-1 తేడాతో ఆధిక్యంలోకి ఉన్నది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని జట్టు లీడ్స్ టెస్ట్‌లో భారత్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. శుభ్‌మన్ నేతృత్వంలోని భారత జట్టు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 336 పరుగుల తేడాతో గెలుచుకుంది.

లార్డ్స్ టెస్ట్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో పది వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. జోరూట్ (104), జేమీ స్మిత్ (51), బ్రైడాన్ కార్స్ (21) పరుగులు చేశారు. టీమిండియా సైతం తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కేఎల్ రాహుల్ (100), రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 192 పరుగులకు కుప్పకూలింది. టీమిండియాకు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత జట్టు కేవలం 170 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. రవీంద్ర జడేజా (61నాటౌట్), కేఎల్ రాహుల్ (39) మినహా ఎవరూ రాణించలేదు.

జడేజా బుమ్రా, సిరాజ్‌తో కలిసి టీమిండియాను గెలిపించేందుకు కష్టపడ్డా అతని శ్రమ అంతా వృథా అయ్యింది. 74.5 ఓవర్‌లో షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సిరాజ్ అవుట్ అవడంతో టీమిండియా పోరాటం ముగిసింది. షోయబ్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ, బంతి బ్యాట్‌పై నుంచి క్రీజులో పడి స్టంప్స్‌ను తాకింది. బంతి వికెట్లను తాకడంతో సిరాజ్ సైతం షాక్‌కు గురయ్యాడు. దాంతో ఇంగ్లండ్ ప్లేయర్స్ సంబరాల్లో మునిగిపోగా.. టీమిండియా ప్లేయర్స్ అంతా షాక్ అయ్యారు. ఇక ఇంగ్లండ్-భారత్ మధ్య నాలుగో టెస్ట్ ఈ నెల 23-27 మధ్య మాంచెస్టర్‌లో ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరుగనున్నది.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జాతీయ క్రీడా బిల్లు



మంత్రి మాండవీయ

**న్యూఢిల్లీ:** రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో.. జాతీయ క్రీడా పరిపాలన బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ తెలిపారు. జూలై 21వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బహుళ దేశాలు పాల్గొనే ఈవెంట్లలో భాగంగా ఇండియాలో జరిగే టోర్నీలకు వచ్చే పాకిస్థాన్ అథ్లెట్లను అడ్డుకోబోమని ఆయన స్పష్టం చేశారు. క్రీడా బిల్లుకు సంబంధించిన సమగ్రమైన వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు నిధుల అంశాన్ని ఆ బిల్లులో ప్రస్తావించనున్నట్లు చెప్పారు. క్రీడా నిర్వహణదారుల కోసం రెగ్యులేటరీ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అత్యున్నతమైన పరిపాలనా, ఆర్థిక, నైతిక ప్రమాణాలు పాటించే రీతిలో ఆ బోర్డు వ్యవహరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పాకిస్థాన్‌తో సంబంధాలు సరైన రీతిలో లేకున్నా.. భారత్‌కు వచ్చే ఆ దేశ క్రీడాకారుల్ని అడ్డుకోబోమన్నారు.

# సిరాజ్‌కు జరిమానా..

## మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత

**లండన్:** ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్‌కు ఫైన్ వేశారు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడవ టెస్టు.. నాలుగవ రోజును బెన్ డకెట్‌ను ఔట్



చేసిన తర్వాత అతను దురుసుగా ప్రవర్తించాడు. ఆ కారణంగా సిరాజ్‌కు మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. అతనికి ఓ డీమెరిట్ పాయింట్ కూడా జోడించారు. లార్డ్స్ టెస్టులో సిరాజ్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అయితే ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.5 ప్రకారం అతను ఉల్లంఘనకు పాల్పడినట్లు ఐసీసీ పేర్కొన్నది. దురుసు భాష, చర్యలు, సంకేతాలు ఇవ్వడం ఆ రూల్ ప్రకారం నేరం అవుతుంది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ సమయంలో డకెట్ 12 రన్స్ చేసి ఔటయ్యాడు. మూడవ టెస్టు మ్యాచ్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. 193 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇండియా 4 వికెట్లు కోల్పోయి 58 రన్స్ చేసింది. ఇవాళ అయిదో రోజు ఆట కీలకం కానున్నది.

# క్రికెట్ రూల్స్‌లో మార్పులు తేవాలని.. ఐసీసీని కోరిన మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే..!

**న్యూఢిల్లీ:** క్రికెట్ రూల్స్‌లో మార్పులు తీసుకురావాలని భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే డిమాండ్ చేశారు. సలైవా వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని, డ్యూక్ బంతి నాణ్యతను మెరుగుపరచాలని ఐసీసీకి సిఫారసు చేరశారు. ప్రస్తుతం ఇంగ్లండ్-భారత్ మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. డ్యూక్ బంతిపై వివాదం తలెత్తింది. ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌తో కుంబ్లే మాట్లాడుతూ.. 'బంతి మృదువుగా మారడం లేదంటే మార్చాల్సిర్ని చెప్పాడు. ఎందుకంటే చాలా తరుచుగా లయను కోల్పోతుంది. ఇందు కోసం ఏదైనా చేయాలి. బంతి పది ఓవర్లు నిలబడకపోతే బంతిని తరుచుగా మార్చడం సరికాదు. క్రికెట్‌కు మాత్రమే కాదు బంతికి కూడా' అని పేర్కొన్నారు. పది ఓవర్ల మ్యాచ్ తర్వాత బంతిని మార్చడంపై టీమిండియా ప్లేయర్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



లార్డ్స్‌లో జరుగుతు మూడో టెస్ట్ మ్యాచ్ రెండోరోజు ఉదయం సెషన్‌లో రెండుసార్లు బంతిని మార్చారు. కేవలం పది ఓవర్ల ఆట తర్వాత బంతిని మార్చడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ మాట్లాడుతూ గతంలోని తయారీ ప్రమాణాల మేరకు బంతిని తీసుకురావడం ఓ పరిష్కారం కావొచ్చని పేర్కొన్నారు. డ్యూక్ బంతి పాత వెర్షన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌కు మద్దతు తెలిపారు. ఐదేళ్ల కిందట అందుబాటులో ఉన్నదాన్ని తిరిగి తీసుకురావడం న్యాయమని తాను భావిస్తున్నానని మాజీ హెడ్‌కోచ్ తెలిపాడు. లాలాజల వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కుంబ్లే డిమాండ్ చేశారు. బంతిని మెరుస్తూ లాలాజలం వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కుంబ్లే ఐసీసీని కోరారు. ఇది బౌలర్లకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బంతిని మెరిసేలా చేయడం, రివర్స్ స్వింగ్ రాబట్టవచ్చని మాజీ కెప్టెన్ తెలిపాడు.

# హరిహరవీరమల్లు రన్‌టైమ్ ఫిక్స్

**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు'. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ,



క్రిష్ జాగర్లమూడి దర్శకులు. ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిన్నారు. ఇటీవల రిలీజ్ చేసిన హరిహర వీరమల్లు థియేట్రికల్ - ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. మొత్తం 162 నిముషాల అనగా రెండు గంటల 42నిమిషాల రన్‌టైమ్‌తో యూ/ఎ సర్టిఫికెట్ తో ఫైనల్ వర్షన్ ను లాక్ చేసారని సమాచారం. సినిమా వీక్షించిన సెన్సార్ టీమ్ నుండి హరిహర టీమ్ కు ప్రశంసలు లభించాయి. చారిత్రక నేపథ్యాన్ని చక్కగా చుపించారని దర్శకుడిని అభినందించారని తెలుస్తోంది. చాలా కాలంగా పవర్ స్టార్ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఆయన ఫ్యాన్స్ కు హరిహర ఒక ఫీస్ట్ లా ఉండబోతుందని యూని ట్ బలంగా నమ్ముతోంది. నేడు సెన్సార్ టీ-మ్ అభినందించడంతో వారి నమ్మకం రెట్టింపైంది. ఇదే జోష్ లో హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సన్నాహకాలు చేస్తున్నారు. అందుకో సం వైజాగ్ వేదిక కాబోతుంది. ఈ నెల 20న హరిహర ప్రీ రిలీజ్ వేడుకకు ప్లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రాజామౌళి ముఖ్య అతిథిగా రానున్నారు.

## కొత్తపల్లిలో ఒకప్పుడు నుంచి సాంగ్ విడుదల




**టాకీస్:** ప్రవీణ పరుచూరి దర్శకురాలిగా పరిచయమవుతున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా -ట్రైలర్ ఆకట్టు-కుంది. తాజాగా ఈ చిత్రంలోని 'రంగనాయకి' సాంగ్ లిరికల్ వీడియో రిలీజైంది. గ్రామీణ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ మెలోడీ సాంగ్ అభిమానులను అలరిస్తోంది. మణిశర్మ ఈ పాటను కంపోజ్ చేశారు. ధనుంజయ్ సీపాన ఆలపించారు. చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించారు. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్, బెనర్జీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# సినిమా వదిలేస్తానని ఏడ్చేశా: నటి ఇలియానా



టాకీస్: 'దేవదాసు' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఇలియానా బ్యూటీ- తన అందంతో , నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాంతో ఈ మూవీ తర్వాత నుంచి ఈమెకు అదిరిపోయే రేంజ్ క్రేజీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. కానీ ఇండస్ట్రీలో హీరోయిన్ ల కెరీర్ గురించి తెలియంది కాదు.. అవకాశాలు వచ్చినట్లే వచ్చి ఆగిపోతాయి. ఇలియాన విషయంలో కూడా ఇదే జరిగింది. దీంతో ఈ అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ- ఇచ్చి అక్కడ కూడా మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రజంట్ ఇండస్ట్రీక్రి దూరంగా ఉండి.. తల్లి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇలియానా సినీ ప్రయాణంలో ఒక కీలక మలుపు గురించి పంచుకుంది.. సినీ రంగం బాహ్యంగా గ్లామరస్‌గా కనిపించినా, వాస్తవానికి చాలా ఒత్తిడులు, భావోద్వేగాలతో కూడి ఉ ంటుంది. ముఖ్యంగా 'దేవదాసు' సినిమా -టైమ్‌లో ఎదుర్కొన్న కష్టం ఎప్పటకి మర్చిపోలేను. ఫస్ట్ సినిమా కావడం వల్ల, సెట్స్‌లో కొత్త వాతావరణం, భాష, వర్క్ కల్చర్ వల్ల ఒత్తిడి ఎక్కువయ్యింది. దీంతో మా అమ్మకి ఫోన్ చేసి 'సినిమా వదిలేస్తానని' ఏడ్చిన.. ఆ సమయంలో తల్లి ధైర్యం చెప్పడం వల్లే ఆమె ఆ సినిమాను పూర్తి చేయగలిగాను. ఈ సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. అదే సినిమా నన్ను స్టార్ గా నిలిపింది.ఒత్తిడిలోనూ ధైర్యంగా ముందుకెళ్లడం ఎంత అవసరమో,మన కుటు-ంబ సభ్యుల మద్దతు కూడా అంతే ముఖ్యం' అని చెప్పకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

### కన్నప్ప బ్యూటీ నటి ప్రీతి ముకుందన్



టాకీస్: ఇటీవల వచ్చిన 'కన్నప్ప'తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు నటి ప్రీతి ముకుందన్. ఆ సినిమాలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ కీలకపాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ప్రీతి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్ అని అన్నారు.కన్నప్ప లాంటి భారీ ప్రాజెక్ట్‌లో అనుకోకుండా అవకాశం వచ్చింది. కొన్నిసార్లు మన ప్రమేయం లేకుండా ఇలాంటి పెద్ద సినిమాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. సవాలుగా ఉండే పాత్రలంటే నాకు ఇష్టం. అవి కష్టంగా ఉన్నప్పటికీ గుర్తింపు తెస్తాయి. అలాంటి పాత్రలు ఉ ంటే ఆడిషన్ ఇవ్వడానికి సిద్ధమే. కన్నప్పలో ప్రభాస్‌తో (సశశిరశ) కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ పాజిటివిటీ- ఉంటు-ంది. ఆయన ప్రత్యేకత స్క్రీన్‌పై కూడా స్పష్టంగా



కనిపించింది. నిజ జీవితంలోనూ ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్. ఆయన పాన్ ఇండియా స్టార్ అయినప్పటికీ సాధారణంగా ఉ ంటారు. ఎవరినీ చిన్నచూపు చూడరు. సెట్‌లో అందరినీ గౌరవిస్తారు' అని ప్రీతి ముకుందన్ చెప్పారు.

మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప'లో ప్రభాస్ రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. వీరిద్దరి మధ్య సంభాషణలు సినిమాకే హైలైట్‌గా నిలిచి ఆకట్టు-కున్న విషయం తెలిసిందే. ఇక 'ఓం భీమ్ బుష్'తో టాలీవుడ్‌కు పరిచయమైన ప్రీతి ముకుందన్ 'కన్నప్ప'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'మైనే ప్యార్ కియా'లో నటిస్తున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది.

## కిరణ్ అబ్బవరం బర్త్ డే స్పెషల్.. అంచనాలు పెంచిన గ్లింప్స్

**టాకీస్:** టాలీవుడ్‌లో హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా వైవిధ్యమైన సినిమాలు చేస్తున్న హీరో కిరణ్ అబ్బవరం. రాజావారు రాణిగారు సినిమాతో తెలుగుతెరకు పరిచయం అయిన ఈ కుర్ర హీరో మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక ఆ తరువాత ఏడాదికి నాలుగైదు సినిమాలు రిలీజ్ చేయడం మొదలుపెట్టాడు. అయితే కిరణ్ సినిమాల్లో కొత్తదనం లేదని ప్రేక్షకులు పలు విమర్శలు చేశారు. దాంతో తాను చేసిన తప్పేంటో తెలుసుకున్న కిరణ్ ఒక ఏడాది గ్యాప్ తీసుకొని.. లుక్, కథ అన్ని మార్చి క సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు.

ఈ సినిమా భారీ విజయాన్ని అందుకోవడంతో కిరణ్ వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులని అలరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటికే ర్యాంప్ సినిమా సెట్స్ మీద ఉండగా.. ఇటీవల మరో సినిమాను ప్రకటించాడు. . రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు బేబీ డైరెక్టర్ సాయి రాజేష్ కథను అందిస్తున్నాడు. ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమాకు చెన్నై లవ్ స్టోరీ అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఇందులో




గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిస్తుంది. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన ఒక చిన్న గ్లింప్స్ విడుదల కాగా, ఆ గ్లింప్స్ తోనే మణిశర్మ సినిమాపై అంచనాలు పెంచాడు.

## అలనాటి నటి సరోజాదేవి కన్నుమూత

### తెలుగులో అగ్రహీరోలతో నటించిన సరోజ

**టాకీస్:** మరో తార రాలిపోయింది. ఒక్కరోజు తేడాతో కోట జ్ఞాపకాలను మరువకుండానే నటి బి. సరోజాదేవి కన్నుమూశారు. సీనియర్ నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజాదేవి (87) కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌ల వంటి దిగ్గజ నటులతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. 1938లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 13 ఏళ్ల వయసులోనే చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ



సినిమాలతో అభిమానులను సొంతం చేసుకొన్నారు. 1955లో 'మహాకవి కాళిదాస' అనే కన్నడ సినిమాతో చిత్రసీమలోకి అడుగుపెట్టారు సరోజాదేవి. 'పెళ్లిసందడి' (1959)లో తెలుగులో అవకాశం వచ్చింది. దీనికంటే ముందు పాండురంగ మహత్యం, భూకైలాస్ ముందుగా విడుదలై గుర్తింపునిచ్చాయి. సీతారామ కల్యాణం (1961), జగదేకవీరుని కథ (1961), శ్రీకష్ణార్జున యుద్ధం (1963), దాగుడు మూతలు (1964), ఆత్మబలం (1964), శకుంతల (1966), దానవీర శూర కర్ణ (1978), అల్లుడు దిద్దిన కాపురం (1991) వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. 1955 నుంచి 1984 మధ్య 29 ఏళ్ల పాటు-వరుసగా 161 సినిమాల్లో లీడ్‌రోల్‌లో నటించిన ఏకైక నటిగా సరోజాదేవి చరిత్ర సృష్టించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.